కోటి ఆశలతో కొత్త ఏడాదికి స్వాగతం


రాయవరంలో ఓ బేకరీలో సిద్ధమైన న్యూ ఇయర్ కేకులు


కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ ఇంటి ముందు రంగవల్లులు వేస్తున్న మహిళలు


2025 ఆకారంలో కూర్చున్న మాచర విద్యార్థులు


గొల్లపాలెం అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో ముగ్గులు పెడుతున్న మహిళలు

- కళకళలాడిన బేకరీలు, హోటళ్లు
- సామాజిక మాధ్యమాల్లోనే శుభాకాంక్షలు
- రంగవల్లులతో నిండిన వీధులు


హసన్‌బాద జెడ్పీ హైస్కూల్‌లో అక్షరాల్లో హ్యాపీ న్యూ ఇయర్‌గా కూర్చున్న విద్యార్థులు

రాయవరం: ఆంగ్ల సంవత్సరం ఆరంభం అవుతున్న వేళ, గత ఏడాది జ్ఞాపకాలు, అనుభవాలను నెమరు వేసుకుంటూ, అంతా మంచి జరగాలని కోటి ఆశలతో నూతన సంవత్సరానికి ప్రజలు స్వాగతం పలికారు. స్నేహితులు, బంధువులు, అధికారులకు శుభాకాంక్షలు తెలిపేందుకు విరివిగా వినియోగించే గ్రీటింగ్ కార్డులు మార్కెట్లో ఎక్కడా కానరాలేదు. వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు ప్రజలు ప్రాధాన్యమిచ్చారు. అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులకు గ్రీటింగ్స్ చెప్పేందుకు పలువురు పూలదండలు, బొకేల దుకాణాలకు క్యూ కట్టారు. వీటిని అధికంగా కొనుగోలు చేసే అవకాశం ఉండడంతో వ్యాపారులు అధిక సంఖ్యలో అందుబాటులో ఉంచారు.

ఆకట్టుకున్న రంగవల్లులు

రామచంద్రపురం, మండపేట క్లస్టర్ పరిధిలోని రామచంద్రపురం, మండపేట పట్టణాలతో పాటు, రాయవరం, కపిలేశ్వరపురం, మండపేట, కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం మండల ప్రజలు న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. 2024కు వీడ్కోలు చెబుతూ, 2025కి స్వాగతం పలికారు. యువత నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ హడావిడి చేశారు. మంగళవారం సాయంత్రం నుంచి ఇళ్లు, వ్యాపార సంస్థల ముంగిట నూతన ఏడాదికి స్వాగతం పలుకుతూ రంగవల్లులతో వాకిళ్లు అలంకరించారు. పలువురు తమ గృహాలను, వ్యాపార సంస్థలను విద్యుద్దీపాలంకరణ సోయగాలను అద్దారు. నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలంటూ పలుచోట్ల క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలు గ్రామాల్లో క్రైస్తవ సోదరులు గీతాలను ఆలపిస్తూ, కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తూ, నూతన సంవత్సరాన్ని సాదరంగా ఆహ్వానించారు. పలుచోట్ల యువత మోటార్ సైకిళ్లపై తిరుగుతూ హంగామా చేశారు. అయితే యువత ఉత్సాహం మితిమీరకుండా ఉండేందుకు పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేశారు. పలు రకాల పూలను తీసుకువచ్చి వ్యాపారులు ఆయా గ్రామాల్లోనే బొకేలను తయారు చేసి విక్రయించారు.

విరివిగా బిర్యానీ పాయింట్లు

పట్టణాలతో పాటు, అనేక గ్రామాల్లో ప్రత్యేకంగా ఎక్కడికక్కడ బిర్యానీ పాయింట్లు వెలిశాయి. ఫ్యామిలీ ప్యాక్‌లు ప్యాకేజీ ధరల్లో అందించారు. గతేడాదికి మించి మిన్నగా పట్నం, పల్లె అనే తేడా లేకుండా రెస్టారెంట్లు, హోటళ్లలో ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేశారు. న్యూ ఇయర్ స్పెషల్ ప్యాక్‌లు, ఆకర్షణీయమైన ఆఫర్లను వ్యాపారులు ప్రకటించారు. హోటళ్లలో రకరకాల నాన్‌వెజ్ వంటకాలు సిద్ధం చేశారు. సాయంత్రం నుంచే బైక్‌లపై యువత హల్‌చల్ మొదలైంది. మద్యం దుకాణాలు మద్యంప్రియులతో కిటకిటలాడాయి.

కొత్త ఏడాదికి వినూత్న స్వాగతం

కపిలేశ్వరపురం: మాచర జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు నూతన సంవత్సరానికి వినూత్న రీతిలో స్వాగతం పలికారు. 2025 ఆకారంలో కూర్చుని తమదైన శైలిలో నూతనత్వాన్ని స్వాగతించారు. విద్యా, ఉపాధి రంగాలు నూతన సంవత్సరంలో వృద్ధి చెందాలని ఆశిస్తూ స్వాగత నినాదాలు చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు 2025 మరింత పటుత్వాన్ని ఇస్తుందని హెచ్ఎం ఎస్.వెంకట్రావు, ఉపాధ్యాయులు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

నూతన సంవత్సర స్వాగత వేడుకలకు ఏర్పాట్లు

కాజులూరు: మండల గ్రామాల్లో మంగళవారం నూతన సంవత్సర స్వాగత వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. 2025 సంవత్సరానికి స్వాగతం చెబుతూ 2024 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ గ్రామాల్లో మహిళలు తమ, తమ ఇళ్ల ముందు రంగులతో రంగవల్లులు వేశారు. యువకులు కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ విందులు, వినోదాలు ఏర్పాటు చేసుకుని పరస్పరం ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. రాత్రి 12 గంటలు కాగానే యువకులు, విద్యార్థులు హ్యాపీ న్యూయర్ అంటూ కేరింతలు కొడుతూ సందడి చేయగా పలువురు కేక్ కట్ చేసి స్థానికులకు పంచారు. గొల్లపాలెంలో అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ సభ్యులు నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని ఆటల పోటీలు, రంగవల్లులను నిర్వహించారు. పలువురు చిన్నారులు, మహిళలు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పోటాపోటీగా ముగ్గులు పెట్టారు. విజేతలకు గొల్లపాలెం అలయన్స్ క్లబ్ అధ్యక్షురాలు, గ్రామ ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరిదేవి బహుమతులు అందజేశారు.

వినూత్నంగా స్వాగతం

రామచంద్రపురం రూరల్: క్యాలెండర్‌లో సంవత్సరం మారుతుందంటే అందరి ఇళ్లలోనూ సందడి నెలకొంటుంది. ఇంటి ముందు అందమైన ముగ్గులు వేసి హ్యాపీ న్యూ ఇయర్, నూతన సంవత్సరానికి స్వాగతం అంటూ మహిళలు, చిన్నారులు అందంగా తీర్చిదిద్దుతారు. అయితే రామచంద్రపురం మండలం హసన్‌బాద జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు మాత్రం పాఠశాల ఆవరణలో హ్యాపీ న్యూ ఇయర్ ఆకారంలో కూర్చుని వినూత్నంగా నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పీఎస్‌బీ ఎస్‌కే సుందరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డ్రాయింగ్ టీచర్ జి.శ్రీను పర్యవేక్షించారు.

కొత్త ఆశలతో..



నూతన సంవత్సరాన్ని ఎప్పుడూ కొత్త ఆశలతో ప్రారంభిస్తుంటాం. ఈ ఏడాది కూడా నూతన సంవత్సరాన్ని ప్రణాళిక ప్రకారం నిర్వహిస్తాను. మంచి ప్రయత్నంతో ప్రారంభిస్తే ప్రతి పనిలోనూ విజయం సాధిస్తాం. ఈ కొత్త సంవత్సరంలో అందరికీ మేలు జరగాలని ఆశిస్తున్నాను.

– సీహెచ్‌వీ సోమిరెడ్డి, ఎంఈఓ, మండపేట

విజయాలు సాధించాలి



కొత్త సంవత్సరం ప్రతి ఒక్కరికీ మేలు చేకూర్చాలి. నూతన సంవత్సరం ఆశాజనకంగా ఉండాలి. ఆవేశకావేశాలకు తావు ఇవ్వొద్దు. ప్రతి మంచి పనికి భగవంతుడి ఆశీస్సులు ఉంటాయి. ఈ కొత్త సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన ఆనందాలను, సంతోషాలను తీసుకురావాలి.

– డి.సురేష్‌బాబు, ఎస్సై, రాయవరం

మండల స్థాయి కిశోరి వికాసం శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రసన్న

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండల స్థాయి కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమం మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో రామచంద్రపురం సీడీపీఓ వి.వరాహలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ అంబటి భవాని మాట్లాడుతూ బాలికలకు కౌమారదశలో అందించాల్సిన మద్దతు ఇచ్చే విధంగా శిక్షణ ఇవ్వడం అభినందనీయం అన్నారు. సీడీపీఓ వరాహలక్ష్మి, డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.ప్రశాంతి, వెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వీవీఎల్ ప్రసన్న, ఎంఈఓ వాసంశెట్టి నాగేశ్వరి తదితరులు మాట్లాడుతూ బాల్య వివాహాలు, కౌమారదశలో తీసుకోవాల్సిన సంరక్షణ, ఆరోగ్యకరమైన పోషకాహారం, లింగ వివక్షతను ఎదుర్కోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి, చైల్డ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, సీడబ్ల్యూసీ కమిటీ సభ్యురాలు జె.సంతోష్‌కుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.నాగమణి, జె.కళ్యాణి, జి.సూర్యావతి, అంగన్‌వాడీ స్కూలు టీచర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈ ఫ్లెక్సీతో లుకలుకలు బహిర్గతం


ద్రాక్షారామలో రాజకీయ చర్చకు దారి తీస్తున్న ఫ్లెక్సీ

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ తెలుగుదేశం పార్టీ నేతలకంటే జనసైనికులకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలుగుదేశం పార్టీ నేతలు సన్నిహితుల వద్ద వాపోతున్నారు. నూతన సంవత్సరం, సంక్రాంతి పండగలను పురస్కరించుకుని నియోజకవర్గ రాజకీయ కేంద్రం ద్రాక్షారామలో జగన్నాయకులు సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ దీనికి ఆజ్యం పోస్తుందని రాజకీయ విశ్లేషకులు చెప్పుకుంటున్నారు. మంత్రి సుభాష్‌ను టీడీపీ అభ్యర్థిగా ప్రకటించిన తరువాత నియోజకవర్గ ప్రజాప్రతినిధుల్లో మొట్టమొదటగా ద్రాక్షారామ సర్పంచ్ ఆయనకు మద్దతు ప్రకటించి చంద్రబాబునాయుడు సమక్షంలో భర్త రామారావుతో కలసి టీడీపీలో చేరారు. అయితే ద్రాక్షారామ నడిబొడ్డున వేసిన ఫ్లెక్సీలో ఆమె ఫొటో వేయలేదు. అదే విధంగా జనసేన నాయకులు ముప్పనపల్లి గణేష్, కర్రా నాగేశ్వరరావు(తాతేలు)లు వేయించుకున్న ఈ ఫ్లెక్సీలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ఫొటో కూడా లేకపోవడంతో దానిపైనా జోరుగా చర్చ నడుస్తోంది. మొత్తం మీద కూటమి పార్టీలో ఉన్న లుకలుకలు ఈ ఫ్లెక్సీతో బహిర్గతమవుతున్నాయని రాజకీయాలపై ఆసక్తి ఉన్న ప్రజలు అనుకుంటున్నారు.

ఘనంగా లక్షతులసి పూజ

కాజులూరు: మండలంలోని కోలంక శ్రీ, భూ సమేత కేశవస్వామి ఆలయంలో మంగళవారం లక్షతులసి పూజ, కుంకుమార్చన తదితర పూజలు ఘనంగా జరిగాయి. స్థానిక క్షత్రియ పరిషత్, దంతులూరి వెంకటసూర్యనారాయణరాజు దంపతులచే జరిగిన కార్యక్రమాల్లో ఆలయ పురోహితులు ఖండవిల్లి శ్రీనివాసాచార్యులు పలువురి వేద పండితులతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ లక్షతులసిపూజ, లక్షకుంకుమార్చనలతో పాటు స్వామికి విశేష సేవలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు.

బాధిత కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ

కె.గంగవరం: మండలంలోని అముజూరు, కోట గ్రామాల్లోని గొట్టు సూరయ్య, చేగొండి గంగాభవాని ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులకు పోలిశెట్టి లక్ష్మీసుబ్బారావు మెమోరియల్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ ఆసరా పథకం ద్వారా మంగళవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. బాధిత కుటుంబాల వారు ట్రస్ట్ చైర్మన్ పోలిశెట్టి చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ కోఆర్డినేటర్ గుబ్బల శ్రీనివాస్, పోలిశెట్టి పెదదబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కృష్ణావతారంలో శ్రీవారి దర్శనం

రాయవరం: మండలంలోని శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి మంగళవారం కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేంకటేశ్వర భక్తజన సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న దశావతార మహోత్సవాల్లో భాగంగా స్వామివారిని కృష్ణావతారంలో అలంకరించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వివిధ గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉద్యాన వనాలను సందర్శించిన విద్యార్థులు



కేదారిలంకలోని ఉద్యాన వనంలో రైతులతో మాట్లాడుతున్న విద్యార్థులు

కపిలేశ్వరపురం: అంబాజీపేటలోని వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని వెంకటరమన్న గూడెం కళాశాల విద్యార్థులు మంగళవారం కేదారిలంకలోని ఉద్యాన పంటలను సందర్శించారు. గ్రామీణ ఉద్యాన కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ చలపతిరావు, డాక్టర్ మమత, డాక్టర్ నీరజ పర్యవేక్షణలో 16 మంది విద్యార్థులు క్షేత్ర పరిశీలన చేశారు. విద్యార్థులు తమ అనుభవాలను ఉద్యాన రైతులతో పంచుకున్నారు. వారు మాట్లాడుతూ స్టిక్కీ ట్రాప్స్ వాడటం ద్వారా రసం పీల్చే పురుగులు, తెల్లదోమ, తల్లి పురుగులు జిగురుకు అంటుకుంటాయన్నారు. పురుగుల సంఖ్య పంట నష్టం తీవ్రతను అంచనా వేయవచ్చన్నారు. బీజామృతాన్ని వాడకం, సేంద్రియ పద్ధతిలో విత్తన శుద్ధి ద్వారా తక్కువ ఖర్చుతో కుళ్లు తెగులును తగ్గించవచ్చన్నారు. ట్రైకోడీమా వాడకం ద్వారా భూమి సారవంతం అవుతుందన్నారు.

టిడ్కో పనులపై ఎమ్మెల్యే సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే

మండపేట: పట్టణంలోని గొల్లపుంత కాలనీలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయానికి సంబంధించి తొలి విడత పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. టిడ్కో, ఎలక్ట్రికల్, మున్సిపల్ అధికారులతో పనుల పురోగతిపై ఆరా తీశారు. తొలి విడతలో పెండింగ్‌లో ఉన్న విద్యుత్, తాగునీటి పైపులైన్లు, శ్లాబ్ లీకేజీ పనులతో పాటు, వీధి దీపాలు కూడా సంక్రాతికి పూర్తి చేయాలని ఆదేశించారు. మిగిలిన పనులు జనవరి నెలాఖరులోపు పూర్తి చేయాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ చుంద్రు శ్రీవర ప్రకాష్, మున్సిపల్ కమిషనర్ రంగారావు, ఎలక్ట్రికల్ డీఈఈ రత్నాలరావు, ఏడీఈ శ్రీధర్, హౌసింగ్ ఇన్‌చార్జి ఎస్ఈఈ వెంకట్రావు, డీఈపీ రాజు, ఏఈలు మోహన్, వివేక్, సీఎల్‌పీసీ బిందు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డులో ప్రమాదకరంగా గుంత



ప్రమాదకరంగా ఉన్న వెదురుమూడి సీసీ రోడ్డులో గుంత

కపిలేశ్వరపురం: వెదురుమూడి ప్రాథమికోన్నత పాఠశాల మలుపులో ఉన్న సీసీ రహదారి గుంత ప్రమాదకరంగా ఉంది. రహదారి మార్జిన్‌లో ఏర్పడిన గుంత మలుపులో ఏర్పడటంతో ద్విచక్ర వాహనాలు గుంతలో పడుతున్నాయి. వాహనాలు ఎదురైనప్పుడు తప్పుకునే అవకాశం సమస్యగా మారింది. సమీపంలో పాఠశాల ఉండటంతో విద్యార్థులు రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదం పొంచి ఉంది. గుంత సమీపాన సచివాలయం, శివాలయం ఉండటంతో రాకపోకలతో రద్దీగా ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి, గుంతను పూడ్చాలని ప్రయాణికులు, గ్రామస్తులు కోరుతున్నారు.

కౌశల్ పోటీల్లో మాచవరం విద్యార్థి ప్రతిభ



పడాల లోకేశ్వరరెడ్డి

రాయవరం: మండలంలోని మాచవరం జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి పడాల లోకేశ్వరరెడ్డి రాష్ట్ర స్థాయి కౌశల్ క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. ఈ విషయాన్ని హెచ్ఎం జి.సుబ్రహ్మణ్యం మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ పోటీల్లో లోకేశ్వరరెడ్డి రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం పొందాడన్నారు. తృతీయ స్థానం పొందినందుకు రూ.2 వేలు, జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చినందుకు రూ.1,500 నగదు బహుమతిని పొందినట్లు చెప్పారు. డీఈఓ డాక్టర్ షేక్ సలీం భాషా, కౌశల్ జిల్లా కో–ఆర్డినేటర్ కొంపెల్ల సుబ్బరాయశర్మ, ఎంఈవోలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ తదితరులు లోకేశ్వరరెడ్డిని అభినందించారు.

తరగతి గదిలో వంట!



అంగర అంబేడ్కర్ స్ట్రీట్ పాఠశాల తరగతి గదిలో చేస్తున్న వంట

కపిలేశ్వరపురం: అంగర అంబేడ్కర్ స్ట్రీట్ ప్రాథమిక పాఠశాలలో వంటశాల లేక అవస్థలు పడుతున్నారు. అంబేడ్కర్ పార్కు వద్ద ఉన్న ఈ పాఠశాలలో రెండు తరగతి గదులున్నాయి. ఒక తరగతి గదిలో బోధన సాగుతోంది. వంటశాల లేకపోవడంతో మరో తరగతి గదిలో వంట చేస్తున్నారు. వంట సామగ్రిని అక్కడే ఉంచుతున్నారు. తరగతి గదిని ఆనుకుని వంట చేస్తుండటంతో సమస్య నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి, పాఠశాలకు వంట గదిని నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

కాజులూరు: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ ఎస్సై ఎం.మోహన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం పోలీసులు మండల గ్రామాల్లో పర్యటించి యువతకు పలు సూచనలు చేశారు. బహిరంగ ప్రదేశాలు, రోడ్డు పక్కల కేక్ కటింగ్, బాణాసంచా పేల్చడం చేయరాదన్నారు. మద్యం తాగి యువత కేరింతలు కొడుతూ బైక్‌లపై తిరగరాదని, వ్యాపార సంస్థలు, హోటళ్లు ప్రభుత్వం నిర్దేశించిన సమయానికే మూసివేయాలన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి

రామచంద్రపురం రూరల్: మండలంలోని చోడవరంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేశారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని ఒక రోజు ముందుగానే ప్రభుత్వం పింఛన్లు అందించిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి, వీఆర్ఓ పంపన విష్ణు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.